

వృద్ధులకు అండగా కోర్టు

జెబిఎల్ వృద్ధాశ్రమాన్ని సందర్శించిన 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు టౌన్ : వృద్ధులకు కోర్టు అండగా ఉంటుందని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. మండలంలోని తుక్కులూరు గ్రామంలో జెబిఎల్ వృద్ధాశ్రమాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధుల ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. వారి వారి కుటుంబాలలో, ఇతర విభేదాలు, తగాదాలకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జడ్జి నాగశైలజ మాట్లాడుతూ సంపాదించిన ఆస్తులు బిడ్డలు కైవసం చేసుకుని, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బాధితులైన వృద్ధులకు కోర్టు అండగా ఉంటుందన్నారు. వయోవృద్ధులైన వారి ఇబ్బందులను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.

రేషన్ కార్డులపై వేటు..!

ఏలూరు జిల్లాలో 10,816 కార్డులు తొలగింపు

'పశ్చిమ'లో 9,581 కార్డులకు మంగళం

రెండు జిల్లాల్లో 20,397 రేషన్‌కార్డులు ఇక లేనట్టే

అత్యంత రహస్యంగా ప్రభుత్వ ఆపరేషన్

లబ్ధిదారులకు కార్డుల తొలగింపుపై స్పష్టత కరవు

వచ్చే నెలలో రేషన్ తీసుకునేటప్పుడు బయటపడే అవకాశం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్‌కార్డుల తొలగింపుపై ప్రభుత్వ అత్యంత రహస్య ఆపరేషన్ కొనసాగించినట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లో 20,397 రేషన్‌కార్డులు తొలగించినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రేషన్‌కార్డుల తొలగింపు సమాచారం కార్డుదారులకైనా తెలుసా అనే అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే నెల రేషన్ తీసుకునేటప్పుడు తెలిసే అవకాశం కన్పిస్తోంది. ప్రభుత్వం ఏ సర్వే ప్రకారం రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియ చేపట్టిందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. చనిపోయిన వారి కార్డులు తొలగించినట్లు పైకి చెబుతున్నా అందులో వాస్తవికతపై అనుమానాలు నెలకొన్నాయి. ఏలూరు జిల్లాలోని 27 మండలాల పరిధిలో 1,123 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిసెంబర్‌లో ప్రభుత్వ డేటా ప్రకారం 6,31,044 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతినెలా ఈ కార్డుదారులు రేషన్ సరుకులు అందుకుంటున్నారు. ఫిబ్రవరి నెల ప్రభుత్వ డేటాలో ఏలూరు జిల్లాలోని రేషన్‌కార్డుల సంఖ్య 6,20,228కు తగ్గిపోయాయి. అంటే గడిచిన డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో ఏలూరు జిల్లావ్యాప్తంగా 10,816 రేషన్‌కార్డులు తొలగింపునకు గురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల పరిధిలో మొత్తం 1,052 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిసెంబర్ నెల డేటా ప్రకారం 5,67,651 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. ఫిబ్రవరిలో తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం కార్డుల సంఖ్య 5,58,070 మాత్రమే ఉన్నాయి. రెండు నెలల వ్యవధిలో 9,581 రేషన్‌కార్డులు మాయమయ్యాయి. రేషన్‌కార్డుల తొలగింపు ప్రక్రియను ఏవిధంగా జరిపారో.. ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. అనర్హుల జాబితాను ఏవిధంగా తేల్చారో అర్థం కావడం లేదు. చనిపోయిన వారి కార్డులను తొలగించాలన్నా క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వ రేషన్ సరుకులు తీసుకోవాలంటే ఈపోస్ యంత్రంలో వేలిముద్ర వేయాలి. వేలిముద్ర వేయకపోతే సరుకులు తీసుకోవడం సాధ్యం కాదు. సరుకులు తీసుకోకపోతే రేషన్‌కార్డు పని చేయదు. ప్రత్యేకంగా తొలగించడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

కొత్త కార్డులు లేవు.. ఉన్న కార్డులు పోయే..!

కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ కొత్త రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఇప్పుడు ఉన్న రేషన్‌కార్డులను తీసేస్తున్న పరిస్థితి నెలకొంది. రేషన్‌కార్డుల తొలగింపుపై పలు అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే నెల రేషన్ తీసుకునేటప్పుడు అసలు విషయం బయటికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియ అంతా ప్రభుత్వం వ్యూహాత్మకంగానే చేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చాక హౌస్‌ఓల్డ్ మ్యాపింగ్ సర్వే మాత్రమే జరిగినట్లు చెబుతున్నారు. రేషన్ కార్డులకు సంబంధించి ఎటువంటి సర్వే జరగలేదని అధికారుల మాటలు చెబుతున్నాయి. జిల్లాలో పి-4 సర్వే కూడా జరగలేదు. అటువంటప్పుడు దేని ఆధారంగా రేషన్‌కార్డుల సంఖ్య తగ్గిపోయిందో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. ఎంతోమంది నిరుపేదలైన జంటలకు రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. కొత్త రేషన్ కార్డు జారీ ప్రక్రియ చేపట్టకుండా ఉన్న కార్డులను తొలగించే చర్యలకు దిగడంపై అందరినీ నివ్వెరపోయేలా చేస్తోంది.

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి


శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి


ప్రజాశక్తి - ఏలూరు

పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల విధుల పట్ల సంబంధిత పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పోలింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 27న తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా జిల్లాకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే పిఒ, ఎపిఒలకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలింగ్ కేంద్రంలో విధులు, పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సులు తెరవడం, సీల్ చేయడం వంటి అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి ఎన్నికల సిబ్బంది నుంచి సమాధానాలను కలెక్టర్ రాబట్టారు. ఈ సందర్భంగా వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ నెల 27న ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారన్నారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని వివరించారు. అందుకు సంబంధించిన పెద్ద బ్యాలెట్ పేపర్‌ను మడతపెట్టి బ్యాలెట్ బాక్సుల్లో వేసే విధానం గురించి వివరించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సంబంధిత బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లు, పోలింగ్ మెటీరియల్స్ చెక్‌లిస్టు ప్రకారం పరిశీలించుకుని తీసుకోవాలన్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికలకు 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో 62 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది ఓటర్లు కలిగి ఉన్నారని, వీరిలో పురుషులు 24,704 మంది, మహిళలు 17,571 మంది, ట్రాన్స్‌జెండర్లు ఏడుగురు ఉన్నారని తెలిపారు. ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి పిఒ, ఎపిఒలు ఎన్నికల కమిషన్ సూచించిన ప్రవర్తనా నియమావళిని పూర్తిగా చదివి అవగాహనతో పకడ్బందీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సు ఆపరేటింగ్, బ్యాలెట్ పేపర్ల పరిశీలన, పిఒ డైరీ నిర్వహణ ముఖ్యమైన పత్రాలని తెలిపారు. గత ఎన్నికల్లో అనుభవాన్ని జోడించి సజావుగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, పిఒ, ఎపిఒ వేసే విధులపై, పోలింగ్ సిబ్బంది నియామకం, ముఖ్యమైన ఎన్నికల సామగ్రి తనిఖీ, పోలింగ్ కేంద్రానికి చేరిన వెంటనే చేయాల్సిన విధులు, పోలింగ్ రోజు విధులు, పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు, పోలింగ్ అధికారి విధులు, పోలింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశార్హత, ఓటరు జాబితా, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, అంధులు, నిస్సహాయ ఓటర్లు, బ్యాలెట్ బాక్సు సిద్ధం చేయడం, పోలింగ్ ఏజెంట్లు గమనించాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల అధికారులకు బ్యాలెట్ బాక్సు ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడంపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి, పిఒ, ఎపిఒలు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

దిడ్ల వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయండి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి విస్తృత ప్రచారం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

పిడిఎఫ్ ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి మండలికి పంపించాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు గ్రాడ్యుయేట్ ఓటర్లు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. పట్టణంలో వివిధ విద్య, ప్రభుత్వ సంస్థల్లో గోపీమూర్తి శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు స్మారక బాలికోన్నత పాఠశాల, అల్లూరి రామకృష్ణంరాజు హైస్కూల్, పస్తుల సాగరం స్మారక ఉన్నత పాఠశాల, డాక్టర్ చీడే సత్యనారాయణ కాలేజీ, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలకు వెళ్లి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉపాధ్యాయుల, అధ్యాపకుల, ఉద్యోగుల, కార్మికుల నిరుద్యోగుల, పేదల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం, హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నారన్నారు. దిడ్ల వీర రాఘవులుకు విజయం చేకూర్చి మనం ప్రాతినిధ్యం వహిస్తున్న మన స్థానాన్ని తిరిగి మనం కైవసం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ ఆర్థిక బకాయిలు చెల్లించకపోవడం, ఐఆర్, పిఆర్‌సి ఇవ్వకపోవడం, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ చేయకపోవడం బట్టి అధికార పార్టీ తీరును అర్థం చేసుకోవచ్చన్నారు. ఇవి సాధారణ, రాజకీయ ఎన్నికలు కాదని మన ఎన్నికలని అన్నారు. ప్రచారంలో ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా నాయకులు విజయరామరాజు, అబ్రహం, నాగబాబు, రామకృష్ణంరాజు, మల్లేశ్వరరావు, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, క్రాంతి, రాము, ప్రసాద్, కోదండం తదితరులు ఉన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం


చింతలపూడిలో ప్రచారం

ప్రజాశక్తి - చింతలపూడి

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, నాయకులు కలిసి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరించారు. 2007 నుండి పిడిఎఫ్ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు జార్జి విక్టర్, రాము సూర్యారావు, షేక్ సాబ్జీ, ఇళ్ల వెంకటేశ్వరరావు ఏవిధంగా పని చేశారో ఓటర్లకు వివరించారు.

కొయ్యలగూడెం :ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని ఎర్రంపేట, రాజవరం, పొంగుటూరు, కన్నాపురం గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటరన్లు కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపిస్తే చట్ట సభల్లో నిరద్యోగుల సమస్యలను శాసనమండలిలో లేవనేత్తుతారన్నారు. బడుగు బలహీన తరగతుల వెనుకబాటుకు కారణమైన ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగడతారని, శ్రామికుల హక్కుల సాధన కోసం కృషి చేస్తారని తెలిపారు. గతంలో కూడా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు వివిధ హక్కుల సాధనకు తీవ్ర పోరాటం చేసి సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు, నాగమణి, పిల్ల తమ్మారావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

ఏలూరు నగరపాలక సంస్థ కార్మికుల ధర్నా



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ (ఆప్కాస్)ను రద్దు చేయాలని ఈ నెల ఆరో తేదీన రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏలూరు నగరపాలక సంస్థ కార్మికులు శనివారం నగర పాలక సంస్థ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన ఆప్కాస్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని 'ఆప్కాస్ రద్దు చేయొద్దు, ఆప్కాస్ ఉద్యోగులను ప్రయివేట్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు అప్పజెప్పొద్దు, ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి, సిఐటియు జిందాబాద్' అంటూ పెద్దఎత్తున నినదించారు. ధర్నానుద్దేశించి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ 2019లో వైసిపి ప్రభుత్వం ఆప్కాస్ సంస్థ నెలకొల్పిందని, దీనివల్ల కార్మికులకు ఎంతో కొంత మేలు జరిగిందని, ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నారని, పిఎఫ్, ఇఎస్‌ఐ సకాలంలో జమ చేస్తున్నారని, కనీస వేతనం అమలు చేస్తున్నారని తెలిపారు. ఆప్కాస్ లేని సమయంలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా ఉండేదన్నారు. ఆప్కాస్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆప్కాస్‌లో ఉన్న లక్ష మంది ఉద్యోగులతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని, అవసరమైతే నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆప్కాస్‌ను రద్దు చేసే ఆలోచన చేస్తే ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, కెవిపిఎస్ నగర నాయకులు ఎం.ఇస్సాక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య విభాగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వరరావు, అల్లం హనుమంతరావు, తానంకి జార్జ్, పంతం చిన్న నాగరాజు, వినుకొండ రమేష్, నరమామిడి నాగమణి నాయకత్వం వహించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

డిఎల్‌పిఒ మహ్మద్ రజాఉల్ల

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డిఎల్‌పిఒ, మండల ప్రత్యేక అధికారి మహ్మద్ రజాఉల్ల అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దర్భగూడెం, ములగలంపల్లి గ్రామల్లో జరిగిన శానిటేషన్ డ్రైవ్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువులను తయారు చేసి వాటిని రైతులకు విక్రయించి ఆ సొమ్మును పంచాయతీల అభివృద్ధికి ఉపయోగించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం ఉషారాణి, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, ప్రియాంక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోస్టర్ విధానాన్ని కొనసాగించాలి

గ్రూపు-2 అభ్యర్థుల నిరసన


గ్రంథాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రూపు-2 అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రోస్టర్ విధానాన్ని కొనసాగించాలని, ఎటువంటి కోర్టు కేసులు లేకుండా నోటిఫికేషన్‌ను నిర్వహించాలని కోరుతూ గ్రూప్-2 అభ్యర్థులు జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానం జిఒ ఎంఎస్ నెంబర్ 77కు వైలేషన్‌గా వచ్చిందని, రిక్రూట్‌మెంట్‌లో ఎక్కడా కూడా రిజర్వేషన్లకు సంబంధించి లేదని, ఎక్కువ పోస్టులు మహిళలకు, ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్, స్పోర్ట్స్ కోటాలో ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ రావడం కోసం గ్రూప్-2 అభ్యర్థులు రోడ్ల మీదకు రావాల్సి వస్తుందన్నారు. నోటిఫికేషన్ సక్రమంగా నిర్వహించాలనీ రోడ్ల మీదకు రావాల్సి వస్తుందని వాపోయారు. నోటిఫికేషన్ రావడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. నోటిఫికేషన్ కోసం ఏడేళ్లు ఎదురు చూడాల్సి వస్తుందని వాపోయారు. ఎపిపిఎస్‌సి వారు రోస్టర్ విధానాన్ని కొనసాగించి గ్రూప్-2 అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

బాలల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సునీల్‌కుమార్



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించి ఉన్నాయని, ఈ చట్టాల అమలు కోసం ప్రభుత్వాధికారులు ఎప్పటికప్పుడు తర్ఫీదు పొంది వారి సంక్షేమానికి కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ సూచించారు. ఆయన అధ్యక్షతన శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జువెనైల్ పోలీస్ యూనిట్‌కు జువెనైల్ చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ చట్టంతో విబేధించిన బాలలతో ప్రవర్తించాల్సిన విధి విధానాలను, వారికి కల్పించాల్సిన పునరావాస సౌకర్యాలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని, నేటి సమాజంలో బాల్యవివాహాలు అక్కడక్కడ కొనసాగుతున్నాయని, వీటిని సమిష్టి కృషితో నిరోధించాలని సూచించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కెకెవి.బులికృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ జువెనైల్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డిసిపిఒలు సూర్యచక్రవేణి, రాజేష్, ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి, సిడబ్ల్యుసి మెంబర్ పి.వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అధికార దర్పం.. హామీల పర్వం..!

పెద్దల సభలో విద్యావంతుల స్థానానికి పోరు హోరాహోరీగా సాగుతోంది. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు ఉండగా పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. అదే సమయంలో ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు ప్రధాన పట్టణాల్లో వివిధ సంఘాల నేతలతోపాటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుస్తూ తనకు ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రధానంగా ఇప్పటి వరకూ వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ఉపాధ్యాయ నేతగా చేసిన పోరాటాలు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు గత 17 ఏళ్లలో శాసనమండలిలో వినిపించిన ప్రజావాణి, మండలి వెలుపల ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచిన తీరును వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైనా తొలి సంతకం చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్ దశకు ఇంకా చేరకపోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలేవీ అమలు కాకపోవడం, నిరుద్యోగ భృతిపై నోరెత్తకపోవడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ విద్యావంతులు ఒకసారి ఆలోచించి పెద్దల సభకు తనను పెద్దరికంగా పంపాలని వీరరాఘవులు అభ్యర్థిస్తున్నారు. ఆయన తరపున పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతోపాటు యువజన, విద్యార్థి, కార్మిక, ప్రజాసంఘాల నేతలు గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పిలిస్తే పలికే వ్యక్తి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అనేది మరోసారి గుర్తు చేస్తున్నారు. ఈ ప్రచారం గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆలోచింపజేస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. నిజమేగా రోజువారీ జీవనంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలివేగా, పాలకులు వీటిని ఎందుకు పట్టించుకోవడం లేదనే చర్చ గ్రాడ్యుయేట్ ఓటర్లలో పెద్దఎత్తున



సాగుతోంది. అదే క్రమంలో ప్రశ్నించే గొంతుకను పెద్దల సభకు పంపాల్సిన ఆవశ్యకతను గుర్తించడంతోపాటు తమకు తెలిసిన పది మందికి చెబుతుండడం రాఘవులుకు కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

అదే సమయంలో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం తరపున మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలు, అధికార పార్టీ నేతలు పెద్దపెద్ద గుంపులుగా వెళ్లి ఓటర్లను అభ్యర్థించడం సాధారణ ఎన్నికలను తలపిస్తోంది. పైగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే తమ అభ్యర్థికి ఓటేయాలంటూ సాగిస్తున్న ప్రచారంపై ఆయా తరగతుల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం సంపూర్ణ మెజార్టీతో గెలిపించినా సమస్యలు పరిష్కరించకపోగా ఈ దబాయింపు ప్రచారం ఏంటనే చర్చ సాగుతోంది. అదే సమయంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎక్కడున్నా నేరుగా కలవొచ్చని గత అనుభవాలు గుర్తు తెచ్చుకుంటున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిలుగా పని చేసిన కచ్చా జార్జివిక్టర్, ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) మినహా నాడు అధికార పార్టీ అండతో గెలిచిన రవికిరణ్ ఎన్నడూ నియోజకవర్గ పరిధిలో కానరాని విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారపరంగా, అంశాలపరంగా, విధానాల పరంగా చూస్తే గ్రాడ్యుయేట్ ఓటర్ల మొగ్గు కచ్చితంగా పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులువైపే ఉందని చెప్పొచ్చు. అయితే అధికార పార్టీ అధికార బలంతోపాటు ప్రలోభాల పర్వానికి తెరలేపుతోంది. ఇప్పటికే దూరప్రాంతాన ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లకు ప్రత్యేక బస్సుల ఏర్పాటుతోపాటు వచ్చి వెళ్లినందుకు భత్యం, కానుకలు, ఇతర సౌకర్యాలు సమకూరుస్తామని కబుర్లు పంపుతోంది. ఇక స్థానికంగా నగదు, తాయిలాలు పంచుతామని ఊరిస్తోంది. అయితే వీటికి విద్యావంతులైన గ్రాడ్యుయేట్ ఓటర్లు లొంగుతారా అనే అనుమానం అధికార పార్టీ నేతల్లోనూ ఉంది. ఈ నేపథ్యంలో తప్పుల తడకగా ఉన్న ఎంఎల్‌సి ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార బలాన్ని ఉపయోగించుకునేలా వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉండి మండలంలో ఒకే పేరున రెండు నుంచి మూడు ఓట్లు ఉన్న నేపథ్యంలో అసలు ఓటరు ఒక ఓటు వేసినా, మిగిలినవి ఏదోక రూపంలో పోల్ చేయించి తమకు ఓటు చేయించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికార యంత్రాంగాన్ని ప్రలోభ పెట్టేందుకు ప్రత్యేక కేంద్రీకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యావంతులు తమ సీటు నిలబెట్టుకుంటారా, లేక అధికార బలందే గెలుపవుతుందా అనేది వేచిచూడాల్సిందేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఇబ్బందుల్లేకుండా బలివే ఉత్సవాలు

అధికారులకు ఎస్‌పి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదేశాలు


మాట్లాడుతున్న ఎస్‌పి, నూజివీడు సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు జరగనున్న బలే రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల ఘనంగా నిర్వహించాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సూచించారు. మండలంలోని బలివే గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద అధికారులతో వారు మాట్లాడుతూ 26వ తేదీన కళ్యాణోత్సవం సందర్భంగా సుమారు రెండు లక్షలకు పైగా యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తమ్మిలేరు వద్ద, స్నానాల ఘాట్ల వద్ద, రహదారుల వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా సకల సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య, తహశీల్దార్ కె.రాజకుమార్, ఎంపిడిఒ జి.రాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముడుపులు ఇచ్చుకోండి.. తవ్వుకోండి..!

జోరుగా మట్టి అక్రమ తోలకాలు, ఆక్వా చెరువుల తవ్వకాలు

నిలుపుదల చేయాలంటూ వ్యకాస ఫిర్యాదు

రెవెన్యూ యంత్రాంగంపై ప్రజల విమర్శలు



మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల రెవెన్యూ యంత్రాంగం చేతులెత్తేయడంతో మండలంలోని వణుదుర్రులో అనుమతులు లేని మట్టి అక్రమ తవ్వకాలు, మట్టి తోలకాలు కొనసాగుతూనే ఉన్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల పేరుతో అక్రమార్కులు ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆక్వా చెరువులు తవ్వకాలు చేస్తూ మట్టిని టిప్పర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. చాలా రోజులుగా ఈ తంతు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ శాఖాధికారులు అడ్డుకున్నదీ లేదు. దీంతో మట్టిమాఫియా చెలరేగిపోతుంది. ఈ తంతు అంతా రెవెన్యూ యంత్రాంగం కన్నుసన్నల్లో జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ముడుపులు ఇచ్చుకోండి ఇష్టం వచ్చినట్లుగా తవ్వుకోండి అన్న రీతిగా రెవెన్యూ శాఖ తయారైందని జనం చెప్పుకుంటున్నారు. మండల స్థాయి అధికార పార్టీ నాయకుని ఆధ్వర్యంలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు, మట్టి తోలకాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా తవ్వకాలు చేస్తూ మట్టిని తరలించుకుపోయి అమ్మకాలు చేస్తూ మట్టి బకాసురులు లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ ముసుగులో సహజ వనరులను కొల్లగొడుతూ చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు. చట్టాలను అమలు చేయాల్సిన రెవెన్యూ అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు, వారిచ్చే ముడుపులకు కక్కుర్తి పడి తొత్తులుగా మారుతున్నారు. కాసులు ఇచ్చుకోండి, తవ్వకాలు చేసుకోండి అంటూ సంబంధిత శాఖల అధికారులు గేట్లు ఎత్తేయడంతో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అంతేకాక మట్టి మాఫియాకు క్షేత్రస్థాయిలో అధికారులు, స్థానిక నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇష్టానుసారంగా అక్రమ తవ్వకాలు, మట్టి అక్రమ తోలకాలు చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. సామర్థ్యానికి మించిన లోడుతో రయ్ రయ్ మంటూ టిప్పర్లు వెళ్లడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గ్రామాల్లో మితిమీరిన వేగంతో టిప్పర్లు రాకపోకలు సాగించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు పొక్లెయిన్లతో నిరంతరం తవ్వకాలు చేస్తూ పదికి పైగా టిప్పర్లతో మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారు.

తవ్వకాలు నిలుపుదల చేయాలి

వణుదుర్రులో ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు, అక్రమ మట్టి తోలకాలను నిలుపుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ జిల్లా కలెక్టర్‌కు, తహశీల్దార్ సుభానికి వినతిపత్రాలు అందించారు. అయినా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నది లేదు. తవ్వకాలపై ఫిర్యాదులు చేస్తున్నా అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో యథేచ్ఛగా ఆక్వా చెరువుల తవ్వకాలు, మట్టి తోలకాలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన బకాసురులు గ్రామంలో విచ్చలవిడిగా చెరువుల అక్రమ తవ్వకాలు, మట్టి అక్రమ తోలకాలు చేస్తూ సహజ వనరులను తరలించుకుపోతున్నారు. గ్రామంలో జరుగుతున్న తవ్వకాలు, మట్టి తోలకాలను వెంటనే నిలుపుదల చేయాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గోదావరి జలాల చెరువు పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో వేసవి కాలంలో నగర ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా తీసుకునే చర్యల్లో భాగంగా దెందులూరులో ఉన్న గోదావరి జలాల చెరువును నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ శనివారం పరిశీలించారు. గోదావరి జలాలు ఏలూరు కాలువ ద్వారా పూర్తిస్థాయిలో రాకపోవడం కారణంగా దెందులూరులో ఉన్న చెరువులో నీటి నిల్వలు తగ్గుతున్నాయని తెలిపారు. దీనిపై ఎంఎల్ఎ బడేటి బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ ప్రత్యేక దృష్టి నిర్వహించారు. అందులో భాగంగా ఎస్ఇ ఎస్.ఎంజీఆర్ పెదబాబు, భానుప్రతాప్ దెందులూరు చెరువు వద్దకు వెళ్లి గోదావరి కాలువ ద్వారా వస్తున్న నీటి జలాలను, పంపింగ్ మోటార్ల పనితీరును పరిశీలించారు.

గ్రూపు-2 అభ్యర్థుల అనుమానాలు నివృత్తి చేయండి

ప్రజాశక్తి - కుక్కునూరు

అనేక పోరాటాల తర్వాత గత ప్రభుత్వం గ్రూప్-2లో 899 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని, రోస్టర్ పాయింట్లలో మిస్టేక్ ఉన్నాయని నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఎపిపిఎస్‌సి స్పందించి రోస్టర్ పాయింట్స్‌లో జరిగిన పొరపాట్లను సరిచేసి భవిష్యత్తులో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డివైఎఫ్ఐ జిల్లా పూర్వ కో కన్వీనర్ యర్రం సాయికిరణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోస్టర్ పాయింట్ల మిస్టేక్ సరి చేయకుండా అభ్యర్థులకు న్యాయం జరగదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని అభ్యర్థుల అనుమానాలు నివృత్తి చేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - భీమడోలు

అంగన్వాడీ కార్యకర్తలను తాత్కాలిక ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దే క్రమంలో అమలు చేస్తున్న 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణా తరగతుల సేవలను సద్వినియోగం పరుచుకోవాలని భీమడోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతుల కోర్సు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక హైస్కూల్ వేదికగా జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతుల రెండో విడత కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు కొనసాగే శిక్షణా తరగతులకు కోర్సు డైరెక్టర్‌గా భీమడోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా రిసోర్స్ పర్సన్లుగా ఉపాధ్యాయులు శరీన్, గోపాలకృష్ణ, రిసోర్స్‌పర్సన్లుగా అంగనవాడీ సెక్టార్ పర్యవేక్షకులు నూర్జహాన్, కవిత, సహాయకులుగా సిఎంఆర్‌టిలు సత్య ప్రసాద్, రమణ వ్యవహరించారు.

జీలుగుమిల్లి : ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం జ్ఞాన జ్యోతి శిక్షణ ఇస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ తులసి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.బుచ్చయ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు రాంబాబు, విద్యాసాగర్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, వెంకాయమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెబిఎల్ వృద్ధాశ్రమానికి కూరగాయల వితరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరులో ఉన్న జెబిఎల్ వృద్ధాశ్రమంలో యువ న్యాయవాది తిరివీధి కృష్ణ శనివారం కూరగాయలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేయడం దారుణమన్నారు. జెబిఎల్ వృద్ధాశ్రమంలో ఉన్న వయోవృద్ధులైన పెద్దలు తన తల్లిదండ్రులతో సమానమని, అవకాశం ఉన్నంతవరకు తాను సహాయ సహకారాలు అందిస్తానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. సహృదయులు స్పందించి జెబిఎల్ వృద్ధాశ్రమానికి తోచిన మేరకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

పలుచోట్ల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు మండల పరిధిలో ఈ నెల 22 ,23వ తేదీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా శనివారం ఎంపిడిఒతో పాటు, పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించారు. స్వయం సహాయక సంఘం సభ్యులు, వెలుగు సభ్యులు, ప్రముఖుల భాగస్వామ్యంతో ఇంటింటా పర్యటన చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సేవలు, తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాలు, ఆ విధంగా సిద్ధం చేసిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించేందుకు సహకరించటం వంటి అంశాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

పోలవరం : మండలంలోని పలు పంచాయతీల్లో ఎంపిడిఒ శ్రీనివాస్ మెగా శానిటేషన్ డ్రైవ్ పనులు యుద్ధప్రాతిపదికన నిర్వహించారు. పోలవరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, కొత్తరామయ్యపేట, ఇటుకలకోట పంచాయతీల్లో తడి, పొడి చెత్తలను, గ్రామాల్లో ఉన్న పెంట కుప్పలను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు.

పట్టిసీమ మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను తహశీల్దార్ సాయిరాజు శనివారం పరిశీలించారు. నదిపై నడకదారి కోసం పంట్ల ఏర్పాటు, టికెట్ కౌంటర్లు, చలువ పందిళ్లు, ఇసుక తిన్నెల్లో నడక మార్గం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనతో పాటు విఆర్ఒ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చికెన్, కోడిగుడ్లు అందజేత

ఆగిరిపల్లి : బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న అపోహాలను తొలగించడానికి శనివారం ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్‌లో శ్రీ వెంకటేశ్వర హేచరిస్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామస్తులకు చికెన్, కోడిగుడ్లను పంపిణీ చేశారు. చికెన్ దుకాణదారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని బాపునగర్ రోడ్డులో నివాసం ఉంటున్న బత్రు వెంకట రమ్య (18) పాలిటెక్నిక్ చదువుతుంది. ఈ క్రమంలో శనివారం కళాశాలకు వెళ్లలేదని రమ్య తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రమ్య ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు రమ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

జీలుగుమిల్లి : ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కనకపురం గ్రామనికి చెందిన ఎస్.బంగారయ్య(56) ఇంట్లో సోమవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలింది. పక్కనే ఉన్న బంగారయ్యకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు.

పుల్లల లోడు ట్రాక్టర్ బోల్తా

బుట్టాయగూడెం : అధిక లోడుతో వెళ్తున్న తురక వేపదుంగలు, జామాయిల్ పుల్లల ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన స్థానిక కొమ్ముగూడెం సెంటర్‌లో శనివారం చోటు చేసుకుంది. అధిక లోడుతో ఉన్న ట్రాక్టర్ వేగంగా రావడంతో అదుపుతప్పి కొమ్ముగూడెం సెంటర్‌లోని లక్ష్మీ గణపతి ఎలక్ట్రికల్ షాపు సమీపంలో బోల్లా పడింది. ఈ ప్రమాదంలో లోడు మొత్తం ఆ షాపుపై పడడంతో షాపులోని ఫ్రిజులు, బ్యాటరీలు దెబ్బతిన్నాయి.

మద్యం విక్రేత అరెస్టు

చింతలపూడి : మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని ఊట సముద్రం గ్రామంలో చేసిన దాడిలో మద్యం సీసాలు అక్రమంగా విక్రయిస్తున్న గ్రామానికి చెందిన మహిళను అదుపులోకి తీసుకుని చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన సబ్‌జోన్ ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న నూజివీడు నియోజకవర్గ సబ్‌జోన్ ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో వాలీబాల్ విన్నర్స్‌గా గుడివాడ హైస్కూల్, రన్నర్స్‌గా ఆగిరిపల్లి హైస్కూల్, త్రో బాల్ విన్నర్స్‌గా మర్లపాలెం హైస్కూల్, రన్నర్స్‌గా ముసునూరు హైస్కూల్, ఖోఖో విన్నర్స్‌గా ఈదులగూడెం హైస్కూల్, రన్నర్స్‌గా సూరవరం హైస్కూల్, కబడ్డీ విన్నర్స్‌గా నూజివీడు హైస్కూల్, రన్నర్స్‌గా త్రివిధ స్కూల్ విద్యార్థులు విజయం సాధించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు టీ షర్టులు

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సబ్‌జోన్ ఆటల పోటీల సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులకు టీ షర్టులు అందించారు. ఆగిరిపల్లికి చెందిన శ్రీ భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ కంపెనీ తరపున ఆ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ పాలడుగు వెంకట శ్రీనివాస్ వితరణగా అందించిన టీ షర్ట్‌లను ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత చేతులమీదుగా వ్యాయామ ఉపాధ్యాయులకు అందించారు.


కానుకొల్లు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థినులు ఆటల్లో అత్యుత్తమమైన నైపుణ్యం కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించారని కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవకుమార్ చెప్పారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విభాగంలో కైకలూరు నియోజకవర్గ స్థాయిలో ముదినేపల్లిలో బాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎల్.రుక్మిణిదేవి, ఎస్.కావ్య పాల్గొన్నారు. వంద మీటర్ల పరుగు పందెంలో రుక్మిణిదేవి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకోగా, 600 మీటర్ల పరుగు పందెంలో కావ్య ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించిందని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో హెచ్ఎం మృతి

ప్రజాశక్తి - ముసునూరు



రత్నకుమార్ (ఫైల్‌ఫోటో)

మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న తొమ్మండ్రు రత్నకుమార్(56) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి మండలంలోని గ్రామాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయనను శనివారం ప్రజలు కలిసి వారి సమస్యలను విన్నవించారు. ఆ సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్ఎ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

120 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

120 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జంగారెడ్డిగూడెం రామచంద్ర కంటి ఆసుపత్రి వైద్యులు డి.ఆదిత్య తెలిపారు. మండలంలోని మక్కినవారిగూడెం సొసైటీ ఆవరణలో సొసైటీ మాజీ అధ్యక్షులు ఆచంట సూర్యనారాయణ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం రామచంద్ర కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, వీరిలో 40 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశామని తెలిపారు. 35 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని సూచించినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎం.జయబాబు విద్యార్థులకు సూచించారు. మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం జెడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాలికల వేధింపులు, ఆర్థిక మోసాలు, నకిలీ రుణ యాప్‌లపై చిట్టి వాహనం ద్వారా జిఎంఎస్‌కె అభయ బృందంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానం ఉంటే వెంటనే 1930, 112, 1098 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

లేగ దూడల ప్రదర్శన

ఆగిరిపల్లి : పశువుల పట్ల పశుపోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని వడ్డమానులో శనివారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించి, మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా లేగ దూడలను పోషణ చేసిన రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - భీమడోలు

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం భీమడోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా భీమడోలు మాంటిస్సోరి విద్యాసంస్థల ఆధ్వర్యంలో పాలేటి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, మాధురి జూనియర్ కాలేజీ విద్యార్థుల గౌరవార్థం నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదేవిధంగా 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే భీమడోలు జాతర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఆయనతో పాటు కార్యక్రమంలో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్, భీమడోలు మాజీ జెడ్‌పిటిసి కరణం పెద్దిరాజు పాల్గొన్నారు. ఫేర్‌వెల్ కార్యక్రమంలో భాగంగా గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి, ప్రస్తుతం విశ్రాంతి ఉపాధ్యాయులుగా కొనసాగుతూ గత 65 ఏళ్ల కాలంగా నిరంతరంగా విద్యా బోధన చేస్తున్న భీమడోలుకు చెందిన పాలేటి బ్రహ్మారావును మాంటిస్సోరి విద్యాసంస్థల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపీతో పాటు ఇతర ప్రముఖులు తిలకించారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలను పురస్కరించుకుని పాఠశాలకు చెందిన పట్టభద్రుల ఓటర్లను ఓట్ల కోసం అభ్యర్థించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ ప్రేమకుమార్, స్వాతి మాధురీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ, భీమడోలు మండలంలో విద్యావ్యాప్తికి మాంటిస్సోరి విద్యాసంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వీరికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

గరికపాటి నాటకోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శ్రీ గరికపాటి ఆర్ట్స్ థియేటర్ వారి గరికపాటి నాటకోత్సవాలు - 2025 శనివారం ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభలో సభాధ్యక్షులు, గరికపాటి ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షులు గరికపాటి కాళిదాసు, ఆత్మీయ అతిథులుగా సినీ విజ్ఞాన విశారద ఎస్‌వి.రామారావు, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, సినీ రచయిత పమిడిపాటి రాజేంద్రకుమార్ తదితరులు మాట్లాడుతూ ఈ నాటకోత్సవాల్లో 274 కార్యక్రమాలు చేయడం గర్వించదగిన విషయమన్నారు. గరికిపాటి ఆర్ట్స్ థియేటర్ కళారంగంలో ఏలూరుకు ఓ మణి కిరీటమన్నారు. తొలుత ప్రదర్శించిన నాటికల్లో సంపాదించిన ఆస్తులు కన్నా విలువలే గొప్పవని, బంధాలు విలువైనవని తెలిపిన నటీనట సమాఖ్య, పాలకొల్లు వారి "అనూహ్యం" నాటిక ప్రేక్షకులను అలరించింది. అనంతరం కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ గుంటూరు వారి తరమెల్లిపోతున్నదో నాటిక సమాజ హితం కోరే సందేశంతో ప్రజల అభిమానాన్ని పొందింది. ఈ కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత పెదపాటి రామకృష్ణ, కిన్నెరా ఆర్ట్స్ థియేటర్స్ జమలాపురం రాధాకృష్ణ, బివిఆర్ కళాకేంద్రం తాడేపల్లిగూడెం బుద్దాల వెంకట రామారావు, కళాకారులు ఎండి ఖాజావలీ, మోతే శ్రీనివాస నారాయణరావు, కళాకారులు, కళాభిమానులు, నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పని చేయాలి

ఆగిరిపల్లి : పారిశుధ్య పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, తడి, పొడి చెత్త సేకరణ నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ ఆదేశించారు. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమ పనులను ఆమె, డివిజనల్ పంచాయతీ అధికా రిణి సుందరీతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను, హానికర వస్తువులను సేకరించే విధానంపై స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా న్ని సందర్శించి, చెత్త నుంచి ఎరువును తయారీ చేసే విధా నంపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సగ్గూరు గ్రామంలో జరిగే స్వామిత్వ సర్వేను పర్యవేక్షించారు. గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీవిక్టర్‌బాబు, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ విస్తరణాధికారి బి.ఆనంద్‌బాబు, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్, స్వయం సహాయక సంఘ సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీతో రుణాలు

కనసానపల్లి యూకో బ్యాంక్ మేనేజర్ కె.శ్రీవిద్య



లోన్ మేళా నిర్వహిస్తున్న యూకో బ్యాంక్ మేనేజర్ శ్రీవిద్య

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వ్యవసాయ, వ్యాపార అభివృద్ధి కోసం రైతులు, వ్యాపారులు తక్కువ వడ్డీ రేట్లతో యూకో బ్యాంక్ అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని కనసానపల్లి యూకో బ్యాంక్ మేనేజర్ కె.శ్రీవిద్య కోరారు. యూకో బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో లోన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ కె.శ్రీవిద్య మాట్లాడుతూ వ్యవసాయ ముద్రా, కుటీర పరిశ్రమలు, రైస్ మిల్లుల అభివృద్ధి కోసం, వ్యవసాయ కమీషన్ ఏజెంట్లకు, వ్యవసాయ గోడౌన్‌లకు, జాతీయ పశు సంక్షేమ మిషన్ కింద గేదేలు, ఆవులు, గొర్రెలు, పందులు, మేకల కొనుగోలు నిమిత్తం తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూకో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఉచిత కుళాయిల పంపిణీ

ప్రజాశక్తి - మండవల్లి

కుళాయి లేని ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే జల జీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్థానిక సచివాలయంలో జల జీవన్ మిషన్ ఉచిత కుళాయిల పంపిణీ కార్యక్రమంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగు నీరందించే విధంగా జలజీవన్ మిషన్ పథకానికి మండవల్లి ఎంపికైనట్టు తమకు తెలియదని ప్రజలు చెప్పారు. మొగలాయిచెరువు వద్ద ఉన్న పథకానికి సుమారు రూ.69 లక్షలు, కొండరాయి చెరువు పథకానికి సుమారు రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటి ద్వారా కుళాయిలేనివారికి ఉచితంగా కుళాయి కనెక్షన్ ఏర్పాటుచేసి తాగునీరు అందించాల్సి ఉందని ఎవరు తెలియజేయలేదన్నారు. 2022లో జలజీవన్ మిషన్‌కు ఎంపికైనప్పటికీ సర్పంచి, కార్యదర్శుల నిర్లక్ష్యంతోనే నేటికీ ఉచిత కుళాయిల పంపిణీ నెరవేరలేదని ఆయనకు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా కుళాయిలేని ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా వ్యక్తిగత కుళాయి పంపిణీ గడువు పూర్తయిపోయిందని, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసుకునే విధంగా నెలలు గడువు పెంచారని తెలిపారు. లబ్ధిదారులను గుర్తించి త్వరితగతన పనులు ప్రారంభించి కుళాయిలను పంపిణీ చేస్తామని, అందుకు గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. మండవల్లి, తక్కిలిపాడు, ఇంగిలిపాకలంక గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ గ్రిడ్లను నిర్మించే విధంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. స్టేషన్ రోడ్ల నివాసాలకు తాగునీరు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరించే విధంగా వాలు ఏర్పాటు చేసేలా మండల పరిషత్ నుంచి రూ.2.50 లక్షల నిధులు మంజూరు చేస్తానని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ తెలిపారు. అనంతరం పంట కాలువలో నుంచి తాగునీరు నేరుగా మొగలాయి చెరువులోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేయాల్సిన కుండీ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

రాజశేఖరంను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ కోరారు. ఏలూరులోని అతిథి హోటల్‌లో అప్పుస్మ ఆధ్వర్యంలో ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యావంతులతో ఎన్నికల ప్రచార సమావేశం శనివారం నిర్వహించారు. ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖరం తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలను, ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, కాంట్రాక్టు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

కొయ్యలగూడెం : రాజశేఖరంను గెలిపించాలని టిడిపి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘాలదేవి కోరారు. కొయ్యలగూడెంలో ప్రచారం చేశారు.

చింతలపూడి : ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయాన్ని కాంక్షిస్తూ జంగారెడ్డిగూడెం ఆలపాటి గంగ భవాని కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అప్కాబ్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, కరటం రాంబాబు, మాజీ ఎంఎల్ఎ మురళీ రామకృష్ణ పాల్గొన్నారు. ప్రగడవరం పంచాయతీలో మాజీ ఎంపిటిసి కనమతరెడ్డి రాజారెడ్డి ప్రచారం నిర్వహించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ద్వారకాతిరుమల గుండుగోలనుకుంట ప్రిన్సిపల్ రాణి తెలిపారు. 2025-26 సంవత్సరానికి గుండుగోలనుకుంట బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు, జూనియర్ ఇంటర్‌లో 80 సీట్లు (ఎంపిసి 40, బైపిసి 40) ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://apbragcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ ఆరో తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ఇంగ్లీష్ మీడియం, ఇంటర్ ఎంపిసి, బైపిసి ఇంగ్లీష్ మీడియం ప్రవేశాలకు బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.శ్రీలక్ష్మి తెలిపారు. గురుకులంలో ప్రిన్సిపల్ శనివారం మాట్లాడుతూ మార్చి ఆరో తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

24 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

భీమడోలు : ఆధార్ కార్డుల నవీకరణ, ఇతర మార్పుల కోసం మండల పరిధిలో ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల వద్ద ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 24 ,25వ తేదీల్లో గుండుగొలను, ఎంఎం.పురం, అంబరుపేట గ్రామ సచివాలయాల వద్ద, 27, 28వ తేదీల్లో కోరుకొల్లు, దుద్దేపూడి, సూరప్పగూడెం గ్రామ సచివాలయాల వద్ద క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.

టిడిపిలో 50 మంది చేరిక

ద్వారకాతిరుమల : మండలంలోని పి.కన్నాపురం గ్రామానికి చెందిన సుమారు 50 మంది వైసిపి యువత టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు సమక్షంలో టిడిపిలోకి చేరారు. టిడిపి నల్లజర్ల కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారికి ఎంఎల్ఎ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యేపూరి దాలయ్య, బిసి మండల నాయకులు మట్టపర్తి రూపేష్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షులు కూరపాటి రమేష్, బాదిన పండు, శివ, బత్తిన శ్రీను, శ్యామ్, తుంగ శివ, అంబటి ఏడుకొండలు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.